


నేటి ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : విజయనగరం | మంగళవారం 03-11-2026 | చీఫ్ ఎడిటర్ : కె వి ఎల్ ఎస్ బాలసుబ్రహ్మణ్యం | సంపుటి : 1 | సంచిక : 103 | పేజీలు : 4 | వెల : 2.00



పురపోరు ముగిసింది.. పరిషత్ పోరు ముందుంది..

పోలింగ్ శాతం నిరాశ..! ఎవరికి కలిసివస్తుంది ?

ఉదయం ప్రతినిధి – విజయనగరం

పురపోరు ముగిసింది. పరిష త్ పోరు ముందుంది. అయితే నగరపాలక సంస్థ పరిధిలో పోలింగ్ శాతం నిరాశపరిచింది. ఆశించిన స్థాయిలో పోలింగ్ జరగలేదు. విశేషం ఏమిటంటే నగరం పరిధిలో అక్షరాస్యులు ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటు వేసేందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో కేవలం 62.65% మాత్రమే ఓటింగ్ నమోదు అయింది. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం ఓటర్లు రెండు లక్షల 23 వేల 50 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 67వేల 50 మంది మహిళలు 72,851 మంది ఇతరులు పదిమంది మొత్తం ఒక లక్ష 39వేల 911 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీలో బొబ్బిలిలో ఓటింగ్ శాతం ఎక్కువగానే ఉంది. నగరపాలక సంస్థ పరిధిలో ఓటింగ్ శాతం బాగా తగ్గడంపై పలు కారణాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికార యంత్రాంగం ఓటర్ స్లి ప్పులను పంపిణీ చేయడంలో విఫలమయ్యారు అనే వాదన ఉంది. మరోవైపు ఓటర్లను చైతన్య పరచడంలో కూడా వైఫల్యం కనబడుతోంది. దీనికి తోడు సహజంగానే ఓటింగ్ సరళి పై నెలకొన్న అసంతృప్తి కూడా కొంత కలిసింది. మొత్తం మీద పుర పోరులో పోలింగ్ శాతం తక్కువగానే నమోదు అయ్యింది. కాగా ఈ తక్కువ శాతం పోలింగ్ ఎవరికి కలిసి వస్తుందనేది ప్రశ్నార్థకమే. కానీ రాజకీయ పక్షాలు ఎవరికి వారు ఇది తమకే అనుకూలమని చెప్పడము విశేషము. మూడో తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో ఇది ఎవరికి కలిసి వచ్చింది అన్నదానిపై స్పష్టత వస్తుంది.

పరిషత్ పోరు..!

రెండవ దశలో పరిషత్ పోరు జరగనున్నది. ఇందులో భాగంగా జడ్పిటిసి ఎంపీటీసీ స్థానాలకు పోటీ జరుగుతుంది. జిల్లా పరిషత్ చైర్మన్ మండల పరిషత్ అధ్యక్ష పదవులు పరోక్షంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ కారణంగానే రాజకీయ పక్షాలు కూడా ఎవరికి వారు అత్యధిక స్థానాలను సాధించడం పై దృష్టి పెట్టారు. జిల్లాలో 27 జెడ్పిటిసి స్థానాలు 449 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం జడ్పిటిసి స్థానాలకు 254 ఎంపీటీసీ స్థానాలకు 2,511 అభ్యర్థులు బరిలో ఉన్నారు. కూటమిలో రెబెల్స్ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగారు. దీంతో ఆయా స్థానాలకు పోటీ చేస్తున్న వారి సంఖ్య అధికంగానే ఉంది. కూటమి భాగస్వామ్యపక్షాలైన తెలుగుదేశం పార్టీ జనసేన అధినేతలు రెబెల్స్ పై చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటన చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈనెల 5వ తేదీన పరిషత్ ఎన్నికలకు పోలింగ్ జరగనున్నది. ఏడవ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. వీటి తరువాత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

బరిలో వారసులు..!

కాగా పరి షత్ పోరులో రాజకీయ వారసులు బరిలో నిలిచారు. వారసుల రాజకీయ ఆరంగేట్రానికి పరిషత్ ఎన్నికలు వేదిక అవుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన చిన్న శ్రీను తన కుమార్తె సిరి సహస్రను జిల్లా పరిషత్ చైర్మన్ చేసేందుకు రాజకీయంగా చక్రం తిప్పుతున్నారు. ఇందుకోసం సిరి సహస్ర జిల్లాలోని తెర్లాం అలాగే కొత్తవలస జడ్పిటిసి స్థానాలకు పోటీ చేస్తున్నారు. మరోవైపు దీనికి పోటీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వారసులు సైతం పోటీలో ఉన్నారు. బొత్స కుమార్తె అనూష తో పాటు కోడలు పూజిత సైతం రాజకీయ ఆరం గేట్రం చేస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి విషయంలో అటు చిన్న శ్రీను ఇటు బొత్స సత్యనారాయణ ల మధ్య ప్రచ్ఛన్న సాగుతోంది. ఈ ఎన్నికల ఫలితాలతో వారి రాజకీయ భవితవ్యం తేలిపోతుంది. మొత్తం 27 జడ్పిటిసి స్థానాలకు 14 స్థానాలను కైవసం చేసుకుంటే జిల్లా పరిషత్ చైర్మన్ పదవి లభిస్తుంది. ఇందుకోసం హోరాహోరీ పోటీ గ్రామాలలో కనిపిస్తోంది. ఐదవ తేదీన జరిగే పోలింగ్ లో నమోదయ్యే శాతాన్ని బట్టి అంచనాలకు అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం ప్రచారం పోటాపోటీగా సాగిస్తున్నారు.

సీతానగరం మండల అభివృద్ధికి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి : ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

సీతానగరం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సీతానగరం మండలంలోని బూర్జ, కృష్ణరాయపురం, లక్ష్మీపురం, సీతానగరం గ్రామాల్లో జడ్పీటీసీ అభ్యర్థి కంకణాపల్లి అనురాధతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సీతానగరం మండలం అభివృద్ధిలో వెనుకబడిందని విమర్శించారు. సీతానగరం వంతెనను పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తుచేశారు. మండలంలోని అన్ని గ్రామాలను అనుసంధానించేలా వంతెనలు, రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. సీతానగరం మండలాన్ని జిల్లాలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్లు లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

సహాయ ఎన్నికల అధికారి, కమిషనర్ వెల్లడి



ఉదయం ప్రతినిధి – విజయనగరం

నగర పాలక సంస్థ పాలకవర్గం ఎన్నకకు ఓట్లు లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియకు రంగం సిద్ధం చేశారు. మొత్తం 62 డివిజన్లకు, మేయర్ అభ్యర్థి కోసం జరిగిన ఓటింగ్ లో 1,39,929 ఓట్లు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈమేరకు లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. మొత్తం ఓట్లు లెక్కింపునకు వార్డుకు ఒక బ్లాక్ చొప్పున 62 బ్లాక్ లు ఏర్పాటు చేశారు. ఏ వార్డుకు ఏర్పాటు చేసిన బ్లాక్ లో ఆ వార్డు బ్యాలెట్ బాక్సులు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఒక్కొకటిగా ఏజెంట్లకు చూపించి ఓట్లను బ్యాలెట్ బాక్సులు నుంచి బయటకు తీస్తారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్లు చూపించి మేయర్ అభ్యర్థి ఓట్లు, వార్డు సభ్యులు ఓట్లు వేరు చేస్తారు. వేరు చేసిన ఓట్లు వేర్వేరు బాక్స్‌ల్లో వేసిన తర్వాత వాటిని 25 చొప్పున కట్టలు కట్టి వార్డు సభ్యులు ఓట్లు వార్డు సభ్యుల కు కేటాయించిన బాక్సులో ,మేయర్ అభ్యర్థులకు వేసిన ఓట్లు మేయర్ కు కేటాయించిన బాక్సులో వేస్తారు. అనంతరం రెండో బ్లాక్ లో మేయర్ అభ్యర్థులు ఓట్లు లెక్కింపు బ్లాక్ లో లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. మరో వైపు మొదటి 31 బ్లాక్ లో వార్డు సభ్యులు ఓట్లు వేరు చేసినవి లెక్కించడం జరుగుతుంది. మొదటి 31 డివిజన్లకు సంబంధించిన ఓట్లు లెక్కింపు ప్రారంభం కానుంది.ఆది అయిన తర్వాత 32 నుంచి 62 వార్డు సభ్యులు ఓట్లు లెక్కింపు ప్రారంభం కానుంది. వార్డు సభ్యులు లెక్కింపు ప్రక్రియ రెండు రౌండ్లలో జరిగేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేశారు. మరో వైపు ఆయా అభ్యర్థుల తరుపున లెక్కింపునకు వచ్చే ఏజెంట్లు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకొని రాకూడదని సహాయ ఎన్నికల అధికారి కమిషనర్ బి బాలస్వామి తెలియజేశారు. సెల్ ఫోన్లు కు అనుమతి లేదని చెప్పారు.లెక్కింపు, ఫలితాలు త్వరితగతిన వెలువడే విధంగా సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు నాయకులు సహకరించాలని ఆయన కోరారు. కౌంటింగ్ కేంద్రం పద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంద న్నారు. గుంపులుగా ఉండకూడదని ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేవిధంగా సహకరించాలని బాలస్వామి కోరారు.

మురసు తుఫాన్ ఎఫెక్ట్.. విజయవాడ డివిజన్‌లో పలు రైళ్ల రద్దు

ఉదయం ప్రతినిధి – అమరావతి

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుఫాన్ ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొస్తోంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ అప్రమత్తమైంది. మురసు తుఫాన్ ప్రభావంతో విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్ల సర్వీసులను రద్దు చేసింది. సోమ, మంగళవారాల్లో నడవాల్సిన తొమ్మిది రైళ్ల సర్వీసులను నిలిపివేసింది. వీటిలో విజయవాడ-గూడూరు, గూడూరు-విజయవాడ, గుంటూరు-తెనాలి, తెనాలి-గుంటూరు రైళ్లు ఉన్నాయి. అలాగే, సోమవారం నడవాల్సిన తెనాలి-రేపల్లె రైలు సర్వీసును కూడా రద్దు చేశారు. మరోవైపు, మంగళవారం నడవాల్సిన రేపల్లె-మార్కాపురం రోడ్, మార్కాపురం రోడ్-రేపల్లె రైలు సర్వీసులనూ రద్దు చేశారు. తుఫాన్ నేపథ్యంలో ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రైల్వే శాఖ ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రైళ్ల రాకపోకలకు సంబంధించిన తాజా సమాచారాన్ని తెలుసుకున్న తర్వాతే ప్రయాణం ప్రారంభించాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు.



ఉదయం ప్రతినిధి – విజయనగరం

రాజకీయ పక్షాలు ప్రజాస్వామ్యానికి జీవనాడులు. ప్రజాస్వా మ్యానికి ప్రతీక అయిన ఎన్నికల నిర్వహణలో ప్రజలు తమ ఓటు హక్కును ఈ జీవనాడుల ద్వారానే వినియోగించుకో వాల్సి ఉంటుంది. అందుకే రాజకీయ పక్షాలను ప్రజాస్వా మ్యానికి పట్టుకొమ్మలు అని కూడా అంటుంటారు. ఇదంతా ఎందుకని అనుకుంటున్నారా... ఆ విషయానికి వస్తున్నాం.. స్థానిక ఎన్నికల్లో తొలి విడత మున్సిపల్ పోలింగ్ ప్రశాం తంగా ముగిసింది. కానీ విచిత్రం ఏమిటంటే ఎన్నికల నిర్వ హణలో అధికార యంత్రాంగం ఒక వైపు ఎంత శ్రమిస్తే మరోవైపు రాజకీయ పక్షాలు అంతకు రెట్టింపు శ్రమించడం జరుగుతుంది. అదేమిటి ఆశ్చర్యపోతున్నారా! ఓటర్లను చైతన్య పరచడం దగ్గర నుంచి స్లిప్పుల పంపిణీ వరకు రాజకీయపక్షాలే పనిచేస్తాయి... పని చేశాయి కూడా. అందుకే రాజకీయ పక్షాలకు జయహో అనక తప్పదు.

ఓటరు స్లిప్పులు ..!

వాస్తవానికి ఎన్నికలకు ముందు రోజు అధికారులు హోట ళ్లకు చెప్పులను పంపిణీ చేస్తారు. ఓటరు ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఉన్న స్లిప్పులో పోలింగ్ బూత్ నెంబరు అక్క డ వరుసు నెంబరు సూచిస్తారు. ఇది ఓటర్కి ఎంతో ముఖ్య మైనది. దీని ఆధారంగానే పోలింగ్ బూతులకు నేరుగా వెళ్లి ఓటు వేసి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ పనిని అసలు అధికారులు చేయాలి. కానీ మున్సిపల్ పోలింగ్ రోజున విజయనగరం పరిధిలో అధికారులు ఎవరూ కూడా స్లిప్పు లను పంపిణీ చేసిన దాఖలాలు లేవు. కొన్నిచోట్ల పంపిణీ జరిగినప్పటికీ అన్ని తప్పుల తడకగా ఉండడంతో ఓటర్లు రాజకీయపక్షాలనే ఆశ్రయించడం విశేషం. రాజకీయ పక్షాలు తమ సొంత ఖర్చులతో ఓటరు జాబితాలను తీసు కుని అందులో వివరాలు ఆధారంగా స్లిప్పులను కూడా తయారుచేసి దగ్గర నుండి ప్రతి ఓటర్లకు అంద చేస్తుం టారు. ఇందుకోసం రాజుకి పక్షాలు కసరత్తే చేస్తారు. ప్రత్యే కంగా సిబ్బందిని నియమించుకుంటారు. కానీ అదేం దురదృష్టము అధికారులు మాత్రం ఆ పని చేయరు.

ఓటరు చైతన్యం..:

ప్రజాస్వామ్యంలో మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఓటర్లను చైతన్యం చేయడము. పోలింగ్ బూతు దాకా ఓట ర్లు రప్పించేలా అవగాహన కల్పించి ఓటు హక్కును విని యోగించేలాగా చేయగలగాలి. వాస్తవానికి ఈ బాధ్యత కూడా అధికారులదే. కానీ ఎక్కడ కూడా అధికారులు ఈ పని చేసినట్లు కనిపించలేదు. ఒకరిద్దరు అధికారులు మాత్ర ము ప్రకటన జారీ చేసి చేతులు దులిపేసుకోవడమే కనిపిం చింది. కానీ రాజకీయ పక్షాలు మాత్రము ఇంటింటికి ప్రచా రం చేసే సందర్భంలో తప్పకుండా ఓటు వేయాలి అంటే పదేపదే చెప్పి వారిలో ఒక చైతన్యాన్ని తీసుకువస్తారు. రాజకీయ పక్షాలు నిర్వహించే సభలలో నాయకులు సైతం ఓటు విలువ గురించి వివరించి తప్పక ఓటెయ్యాలని విజ్ఞప్తి చేస్తుంటారు. కానీ ఈ తరహా ప్రక్రియ అధికారులలో మాత్రము కనిపించదు... కనిపించలేదు కూడా.

మరోదారిలేదు..!

వాస్తవానికి ఓటరును ఎలాంటి ప్రలోభానికి గురి చేయకూ డదు. ఓటుకి నోటు మద్యం బిర్యాని వంటి వాటిని ఆఫర్ చేయకూడదు. కానీ భారత ప్రజాస్వామ్యంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఓటర్లు ఈ చైతన్యం మాత్రం ఎక్కువగా కనిపిస్తోంది. అత్యధిక మంది ఓటర్లు మాకు ఏమిస్తావని ప్రత్యక్షంగానే ప్రచారానికి వచ్చిన రాజకీయ పక్షాల ప్రతిని ధులను అడిగేస్తున్నారు. ఇది జగమెరిగిన సత్యం. బహిరంగ రహస్యం. ఓటర్ల ఒత్తిడి తట్టుకోలేక పలు రాజకీయ పక్షాల ప్రతినిధులు అభ్యర్థులు విధి లేని పరిస్థితులలో ఏదో ఒక తాయిలం ఇవ్వడం పరిపాటిగా మారింది. అది తప్పు అని తెలుసు అలా చేయకూడదు అని కూడా తెలుసు. కానీ ఓట ర్లే చెయ్యి చాపి నోరు తెరిచి అడుగుతుంటే ఎవరు మాత్రం ఏమి చేయగలరు? అలా స్వచ్ఛందంగా బాధ్యతగా ఏమి ఆశించకుండా ఓటు వేసే వారిని వేళ్ళపై లెక్కించవచ్చు. అడిగిన తర్వాతే ఇవ్వకుంటే ఎలా? అందుకే ఒకరిని చూసి ఒకరు అభ్యర్థులు ఏదో ఒకటి ఇవ్వడం పరిపాటిగా మారింది. కొందరు ఓటర్లైతే మరీ దారుణం. ఆ పార్టీ వారు ఇంత ఇచ్చారు.. మీరు ఎంత ఇస్తారు... డబ్బే నా.. మరేమీ లేదా అంటూ నిలదీసే వారు కూడా ఉన్నారు. అందుకే అభ్యర్థుల సైతం మరో దారి లేక ఒకరిని చూసి ఒకరు ఏదో ఒకటి ఇవ్వడం డబ్బులు పంపిణీ చేయడం సర్వసాధారణ మైపోయింది. విజయనగరం మున్సిపల్ ఎన్నికలలో ఓటుకి వెయ్యి రూపాయలు ఒక జీడిపప్పు ప్యాకెట్టు బాదంపప్పు ప్యాకెట్ ఇవ్వడం చర్చనీయాంశమే అయింది. ఈ ఖర్చులే అభ్యర్థులకు తడిసి మోపె డు అవుతున్నాయి. ఇదంతా అనధికారమే. సాక్షాలు ఉండవు. ఎవరికి వారు మౌనం పాటిస్తారు. కానీ జరిగిన విషయాన్ని ఎవరూ కాదనలేరు కదా! ఇచ్చేవారు ఇచ్చాను అని చెప్పరు పుచ్చుకునేవారు పుచ్చుకున్నాను అని చెప్పరు. కానీ పబ్లిక్ టాక్ మారదు కదా! అయినా సరే అభ్యర్థులు భరించాల్సిందే. అందుకే ఎన్నికలు అనేవి ఖర్చుతో కూడుకున్నవి అయిపోయాయి. అభ్యర్థుల ఎంపికలో డబ్బే ప్రామాణికంగా కూడా మారిపోయింది. విచిత్రం ఏమిటంటే అందరి దగ్గర అన్ని తీసుకుంటారు అడిగిమరీ తీసుకుంటారు కానీ ఓటు మాత్రం నచ్చిన వారికే వేస్తారు. ఓటుకు నోటు ఒక సహజ ప్రక్రియ కింద మారిపోయింది. మళ్లీ దీని గురించి మాట్లాడడానికి ఓటర్లు ఇష్టపడరు. కానీ అదిగో అక్కడ జరిగింది ఇక్కడ జరిగింది అంటో పాపం రాజకీయ పార్టీలను నేతలను వేలెత్తి చూపిస్తుంటారు.

కొసమెరుపు...!

ఐదేళ్ల పాలన ఖరీదు ఓ వెయ్యి రూపాయలు.. ఒక జీడిపప్పు బాదం పప్పు ప్యాకెట్.. ఒక బిర్యానీ పొట్లం.. ఒక క్వార్టర్ మద్యము. అందుకే గెలిచిన అభ్యర్థి సైతం ఐదేళ్లలో తాను ఎంత అయితే ఖర్చు పెట్టారో అంతకు రెట్టింపు రాబట్టుకోవడం పైనే దృష్టి పెడతారు. సమస్య పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చే ప్రజలని అదే తిరస్కార భావంతో చూస్తారు. పట్టించుకోరు... అలా తిప్పుతూనే ఉంటారు. అప్పటికి కూడా ఓటర్లకు జ్ఞానోదయం కాదు. గెలిచిన వారిని అడగలేరు. మింగలేని కక్కలేని పరిస్థితి. అదే ఏమి అశించకపోతే ప్రశ్నించవచ్చు నిలదీయవచ్చు. అంతేకాదు అలాంటి ఓటరుకు రాజకీయ పక్షాలు నాయకులు కూడా వంగి వంగి దండాలు పెట్టి మర్యాద చేస్తారు. వెంటనే పని చేసి పెడతారు కూడా.. కాబట్టి ఓటరు ఒక్క క్షణం ఆలోచించు... రాజకీయ పక్షాలను నాయకులను వేలెత్తి చూపే ముందు నీ మనస్సాక్షిని ఒకసారి ప్రశ్నించుకో.. ఆత్మ పరిశీలన చేసుకో.. ఓటు అంటే సంపాదించి పెట్టే సాధనం కాదు.. ఓటరు మారితేనే గాని ప్రజాస్వామ్యం ఫలితాన్ని ఇవ్వదు.


వీరేష్ చంద్రదేవ్ గెలుపు ఏకపక్షమేనా..!



(జి గోపాలరావు)

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

- టిడిపిలోకి కొనసాగుతున్న చేరికల పరంపర
- ఊపందుకున్న కురుపాం జడ్పిటిసి ప్రచార పర్వం



మన్యం జిల్లా జడ్పిటిసి ఎన్నికల్లో కురుపాం జడ్పిటిసి స్థానం ప్రత్యేకత చాటుతుంది. తెదేపా తరఫున జడ్పీ చైర్మన్ రేసులో కురుపాం స్థానం నుండి ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ పేరు దాదాపు ఖరారు కావడంతో మరింత ఆసక్తి నెలకొంది. ఈ స్థానం నుండి 7 గురు అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా తెదేపా, వైసిపి అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. కురుపాం మండల పరిధిలో 23 పంచాయతీ గ్రామాలు, 14 ఎంపీటీసీ సెగ్మెంట్లు ఉండగా 35868 ఓటర్లు అభ్యర్థుల భవితను తేల్చనున్నారు. ప్రధానంగా కురుపాం దాదాపు 7వేల ఓట్లు, నీలకంఠాపురం, మొండెంకల్ మేజర్ పంచాయతీలలో 4500 ఓటర్లు ఉండి కీలకంగా నిలుస్తారు. గతంలో జరిగిన పోలింగ్ సరళి లెక్కల ప్రకారం దాదాపుగా 23 వేల నుండి 25 వేల వరకు పోలింగ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు విభిన్న పార్టీలకు చెందిన నేతలు లెక్కలు కడుతున్నారు. స్థానిక కురుపాం పంచాయతీకి చెందిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు పార్టీలకు అతీతంగా మూకుమ్మడిగా తమ నాయకుడు వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ నకు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ తమ తమ కుటుంబాలకు చెందిన ఓటర్లు ఎక్కడ ఉన్నా పోలింగ్ సమయానికి తీసుకువచ్చే ఏర్పాట్లలో బిజీగా ఉన్నట్లు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఇలా దాదాపుగా 7 వేల ఓట్లలో ఒకటి అర తప్పితే మిగిలిన వారు వీరేష్ కు మద్దతు తెలిపేందుకు ముందుకు రావడం గమనార్హం. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో తెదేపాకు మండలం నుండి 3500 ఓట్లు వరకు మెజారిటీ వచ్చింది అలాంటిది వీరేష్ నేరుగా బరిలో ఉండటంతో ఏకపక్షంగా పోలయ్యే పరిస్థితులు స్పష్టమవుతున్నాయి. అలాగే మిగిలిన నీలకంఠాపురం , మొండెంకల్ పంచాయతీ గ్రామాల్లో కూడా గిరిజనులు ,ఇతరులు వీరేష్ పట్ల సానుకూలంగా ఉండి అత్యధిక మెజారిటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 14 ఎంపీటీసీ సెగ్మెంట్లలో క్రాస్ ఓటింగ్ జరిగి వీరేశ్ దేవ్ కు మెజారిటీ వచ్చే పరిస్థితులు ఉన్నాయి. ఇలా ఏ విధంగా లెక్కలు వేసుకున్న జడ్పిటిసి ఎన్నికల్లో వీరేష్ చంద్రదేవ్ నకు ఏకపక్ష మద్దతు ఖాయంగా కనిపిస్తుంది. కొనసాగుతున్న చేరికల పర్వం.... జడ్పిటిసి స్థానం వీరేశ్ చంద్రదేవ్ కు కేటాయించడంతో విపక్ష వైసిపి ఇతర పార్టీల నుండి తెదేపాలోకి చేరికల పర్వం కొనసాగుతుంది. ముఖ్యంగా మెజారిటీ ఓటు బ్యాంకు ఉన్న నేతలు తెదేపా తీర్థం పుచ్చుకోవడంతో పార్టీకి కలిసి వచ్చే అంశం. మొదటగా నియోజకవర్గ కళింగ వైశ్య సామాజిక వర్గ అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు .తర్వాత కురుపాం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కొదంగుల్ల మజ్జి గౌరీ శంకర్రావు 70 కుటుంబాలతో పార్టీ తీర్థం పుచ్చుకోవటం మరింత బలాన్ని చేకూర్చినట్ల అయ్యింది. వీరితోపాటు గిరిజన ప్రాంతాల్లో తటస్తులు మేధావులు వీరేశ్ చంద్రదేవ్ కు బాసటగా నిలుస్తున్నారు. కూటమి అభివృద్ధి సంక్షేమ పథకాలే ప్రచారస్త్రాలు.... గత రెండున్నర ఏళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమలు చేస్తూ వస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలే ప్రచార అస్త్రాలుగా ప్రజల్లోకి నాయకులు తీసుకువెళ్లి సానుకూలంగా మలుచుకుంటున్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాలకు లింకు తారు రోడ్లు, గ్రామాల్లో సిసి రోడ్లు కాలువలు మౌలిక సదుపాయాల కల్పన తోపాటు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి తేవడం ముఖ్యంగా వ్యవసాయం విద్య ఆరోగ్య రంగాలలో మరిన్ని కీలక మార్పులు చేపట్టి ప్రజలకు అండగా ఉండటం తో పాటు పింఛన్లు స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సంవత్సరంలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది బిడ్డలు చదువుకున్న చెరో 15 వేల రూపాయల అందుచేత రాయితీ విద్యుత్ బిల్లులు గిరిజనులకు ఉచితంగా సోలార్ పవర్ అవకాశాలు తదితరాలను వివరిస్తూ ప్రజల్లో పార్టీ పట్ల సానుకూల దృక్పథాన్ని పెంచడం ఎన్నికలో అనుకూలంగా మారే పరిస్థితిలు కనిపిస్తున్నాయి. కలిసి వస్తున్న పార్టీ నేతలు.. పదవులు పందేరంలో అవకాశాల కోసం తమవంతు ప్రయత్నాలు చేసుకున్నప్పటికీ చివరగా ఒకరికే పదవి దక్కడం సాధారణంగా ఉన్న విషయంలో కురుపాం మండలంలో పదవుల కోసం ప్రయత్నం చేసిన తెదేపా నాయకులు కూడా తదనంతరం మొఖం చాటు వే య్యకుండా అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీ గెలుపు కోసం శ్రమించడం గమనార్హం. వీటితోపాటు నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తమ పూర్తి సహాయ సహకారాలను అభ్యర్థి గెలుపు కోసం అందించడం శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి ముందుకు వెళ్తున్నారు ట్రైకర్ డైరెక్టర్ పువ్వల లావణ్య, మాజీ ఎమ్మెల్యే జనసేన నాయకులు నిమ్మక జయరాజు మాజీ ఎంపీపీ నీలకంఠం, మరో తెదేపా నేత వెంకటాపు భారతి, అరిక విప్లవ కుమార్, వొబ్బంగి గణపతరావు తదితరులంతా అభ్యర్థి వీరేశ్ చంద్ర దేవ్ గెలుపుకు శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారూ. ఇది అదనంగా కలిసి వచ్చే అంశం. ఇలా అన్ని అంశాలు వీరేష్ చంద్ర దేవ్ గెలుపుకు బాటలు వేస్తాయని , గెలుపు నల్లేరుపై నడకగా ఏకపక్షం వహిస్తాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులు కూడా ఆ మేరకు స్పష్టం చేస్తున్నాయి. మరి ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూద్దాం.

గరుగుబిల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

నవంబర్ 1 నుంచి 7 వరకు సుస్థిర జీవనశైలి వారోత్సవాలు



ఉదయం ప్రతినిధి – గరుగుబిల్లి

గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విజయలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి రికార్డులు, రోజువారీగా నమోదవుతున్న ఆరోగ్య సమస్యల వివరాలను పరిశీలించారు. జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, అందిస్తున్న చికిత్స వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. రోగుల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వాటి ఫలితాలు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డా. విజయలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ‘మిషన్ లైఫ్’ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, ప్రజల్లో పర్యావరణహిత అలవాట్ల పెంపునే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా రోజువారీగా ఆరోగ్యకరమైన జీవనశైలి, శక్తి సంరక్షణ, నీటి సంరక్షణ, సుస్థిర ఆహార వ్యవస్థలు, ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ తగ్గింపు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, సాధారణ వ్యర్థాల తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో పాటు ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, సూపర్‌వైజర్లు జగదీశ్వరి, ఉదయ్ కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ లుగా సిపిఎం అభ్యర్థులను గెలిపించండి!

ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే సుబ్బరావమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు పిలుపు!



ఉదయం ప్రతినిధి – గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం జడ్పిటిసి సిపిఎం అభ్యర్థి మండంగి శ్రీనివాసరావు, చెముడు గూడ ఎంపిటిసి సిపిఎం అభ్యర్థి బిడ్డిక చామంతి ని స్థానిక ఎన్నికల గెలిపించి చట్ట సభలకు పంపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే సుబ్బరావమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి కే. గంగు నాయుడు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గుమ్మలక్ష్మీపురం మండలంలోని చెముడుగూడ, ఇరిడి సెగ్మెంట్ ల పరిధిలోని కుక్కిడి, నిగరం, పెదగూడ, గుణద, కోసింగి భద్ర, వంగర వివిధ గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సభలలో వారు మాట్లాడుతూ ఇప్పటికే గిరిజన ప్రాంతంలో ప్రజల సమస్యలపై ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని, జిఒ 3 కి ప్రత్యామ్నాయ చట్టం తేవాలని జరిగే ఆందోళనలకు సిపిఎం అభ్యర్థులు మండంగి శ్రీనివాసరావు, బిడ్డిక చామంతి నాయకత్వం వహించారని అన్నారు. ప్రజా సమస్యల పట్ల పనిచేసే ఆలోచన కలిగిన అలాంటి నాయకులను జడ్పిటిసి, ఎంపిటిసిలు గా గెలిపించాలని ఆమె గిరిజనులను కోరారు. మండలంలో పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులందరూ ప్రజా ఉద్యమ నాయకులేనని అలాంటి ఉద్యమకారులను ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, జడ్పిటిసి అభ్యర్థి మండల శ్రీనివాసరావు ఎంపిటిసి అభ్యర్థి బిడ్డిక చామంతి లను “సుత్తి కొడవలి నక్షత్రం” గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు బిడ్డిక సత్యం, బిడ్డిక శంకరరావు, పువ్వల తిరుపతిరావు, మాజీ జడ్పిటిసి సభ్యురాలు కే లక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ శ్రీదేవి, బీ లక్ష్మి, ఉపాధ్యక్షులు ఎం గౌరీ,ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, కే గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి, నిర్లక్ష్యానికి తావివ్వొద్దు
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎన్ ప్రభాకర రెడ్డి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎన్ ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరగ కుండా పర్యవేక్షించాలి. చెల్లుబాటయ్యే, చెల్లుబాటు కాని ఓట్లను నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి కల్పించాలి. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి విరామం లేకుండా నిరంతరాయంగా లెక్కింపు సాగేలా సిబ్బందిని సిద్ధం చేయాలి. కౌంటింగ్ హాలుకు బయటే ఆహారం, తాగునీటి ఏర్పాట్లు చేయాలి. కౌంటింగ్ కేంద్రాల్లో రౌండ్లు, వార్డుల వారీగా బ్యాలెట్ బాక్సులను క్రమబద్ధంగా వేరు చేసి లెక్కింపునకు సిద్ధం చేయాలి. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరాదు. భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంతరాలు లేకుండా ఫలితాల ప్రకటనకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

పురపోరు ముగిసింది.. ఇక జడ్పీ, ఎంపీటీసీ సమరం: పార్వతీపురం మన్యంలో మారుతున్న సమీకరణాలు!



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం మన్యం

పార్వతీపురం మున్సిపాలిటీలో ఆదివారం పోలింగ్ ముగియడంతో, రాజకీయ పార్టీల దృష్టి ఇప్పుడు గ్రామీణ స్థానిక సంస్థలైన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై పడింది. గిరిజన ప్రాంతాలు, మైదాన ప్రాంతాలు కలగలిసిన మన్యం జిల్లాలో ఈ ఎన్నికలు రాబోయే సార్వత్రిక రాజకీయాలకు దిక్సూచిగా మారనున్నాయి. ప్రధాన పార్టీలైన కూటమి (టీడీపీ–జనసేన–బీజేపీ), ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఈ పోరును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

కూటమి పార్టీల మధ్య విభేదాలు: !

రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడి మున్సిపాలిటీల్లో సజావుగా సీట్ల సర్దుబాటు చేసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి ఎంపీటీసీ స్థానాల్లో పొత్తుల గందరగోళం వ్యక్తమవుతోంది. జియ్యమ్మవలస మండలం వివాదం: ఇటీవల జియ్యమ్మవలస మండలం అర్నాడ గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం సందర్భంగా టీడీపీ, జనసేన నాయకుల మధ్య జరిగిన తోపులాట, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని నిలదీయడం వంటి సంఘటనలు క్షేత్రస్థాయిలో ఉన్న అంతర్గత విభేదాలను బయటపెట్టాయి. బీ–ఫారాల గందరగోళం: పలు స్థానాల్లో ఇరు పార్టీల అధిష్టానాలు స్థానిక అభ్యర్థులకు విడివిడిగా బీ–ఫారాలు జారీ చేయడంతో ‘అనివార్యమైంది. ఇది ఓట్ల చీలికకు దారితీసి, ప్రతిపక్షానికి లాభిస్తుందేమోననే ఆందోళన కూటమి అగ్రనాయకత్వంలో కనిపిస్తోంది.

వైసీపీ ‘రివర్స్ వ్యూహం’.. పాలకొండపై ప్రత్యేక ఫోకస్!

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి స్పీడ్‌కు అడ్డుకట్ట వేయాలని చూసిన వైసీపీ, జడ్పీటీసీ స్థానాల్లో ఎలాగైనా పట్టు సాధించాలని వ్యూహాలు పన్నుతోంది. ముఖ్యంగా పాలకొండ నియోజకవర్గంలో పార్టీని గెలిపించే బాధ్యతలను అగ్రనాయకత్వం భుజాన వేసుకుంది. టాప్ లీడర్ల రంగప్రవేశం: జిల్లా ఎన్నికల ఇంచార్జ్ దాడి రత్నాకర్, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మరియు నియోజకవర్గ ఇంచార్జ్ పడాల భూదేవి సమన్వయంతో పాలకొండ పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై సుదీర్ఘ సమీక్షలు జరిపారు. ప్రచార అస్త్రాలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ హామీలను క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు చేయలేకపోయిందనే అంశాన్ని గ్రామీణ ఓటర్లలోకి బలంగా తీసుకువెళ్లాలని వైసీపీ క్యాడర్ భావిస్తోంది.

గెలుపోటములను శాసించే అంశాలు:

గిరిజన ఓటు బ్యాంక్: మన్యం జిల్లాలోని ఏజెన్సీ మరియు గిరిజన గ్రామాల ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనేది జడ్పీటీసీ పీఠాన్ని నిర్ణయిస్తుంది. ఐటీడీఏ (ఎణఖా) ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు ఇక్కడ కీలకం కానున్నాయి. మున్సిపల్ ఫలితాల ప్రభావం: రేపు (నవంబర్ 3) విడుదల కాబోయే పార్వతీపురం మున్సిపల్ ఎన్నికల ఫలితాల ప్రభావం నేరుగా ఈ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంపై పడనుంది. మున్సిపాలిటీలో గెలిచిన పార్టీకి గ్రామీణ ఎన్నికల్లో సహజంగానే పొలిటికల్ అడ్వాంటేజ్ లభించే అవకాశం ఉంది. మొత్తానికి, ఒకవైపు కూటమిలోని అంతర్గత అసమ్మతిని చక్కదిద్దుకునే పనిలో ఎమ్మెల్యేలు నిమగ్నమవ్వగా, మరోవైపు పట్టు కోల్పోకుండా వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ పుర–గ్రామీణ పోరు మరెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

మున్సిపల్ ఎన్నికల లెక్కింపు కేంద్రం వద్ద కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి : మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



పురపాలక సంఘం ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువలను నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్కింపు కేంద్రాన్ని నిర్ణయించి నందున ఉదయం 8 గంటలకు ప్రారంభం కాబోయే ఎన్నికల ఫలితాలు లెక్కింపు కేంద్రానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు మరియు చైర్పర్సన్ అభ్యర్థి తోపాటు లెక్కింపు ఏజెంట్లుగా వెళ్లబోతున్న కార్యకర్తలకు సోమవారం మాజీ శాసనసభ్యులు సమన్వయకర్త అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో చైర్ పర్సన్ అభ్యర్థితో పాటు 36 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు వారి ఏజెంట్లుకి తగు సూచనలు, సలహాలు ఇచ్చి రేపు మంగళవారం ఉదయం 8 గంటలకు కచ్చితంగా ఎన్నికల కేంద్రం వద్దకు చేరుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు నిరక్షణకు తావు లేకుండా కౌంటింగ్ టేబుల్ వద్ద చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఓటు కీలకం కాబట్టి ప్రతి ఒక్క పరిశీలించి ఏదైనా అనుమానం వచ్చిన ఓట్లను అధికారులు చెప్పే పక్కన ఉంచాలని, కౌంటింగ్ మొత్తం పూర్తి అయిపోయాక అధికారులు నిర్ధారణ పత్రాలు మంజూరు చేసిన మాత్రమే కేంద్రం నుంచి బయటకు రావాలని ఏ ఒక్కరు కూడా తొందరపాటు చర్యలకి పోకుండా అందరు కూడా చాలా ఓర్పుతో లెక్కింపు చివరి క్షణం వరకు వేచి చూడాలని అందుకు సంబంధించిన నియమాలు నిబంధనలు వారికి స్పష్టంగా తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ అభ్యర్థి పట్నాన సాయి శ్రీ, పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్లి మాధవరావు, జిల్లా పార్టీ కార్యదర్శి పోల సత్యనారాయణ, జిల్లా వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు సర్వేశెట్టి శ్రీనివాసరావు, షేక్ షఫీ, పాత గౌరీశంకరరావు, 36 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ముమ్మరంగా వైసిపి ఎంపిటిసి అభ్యర్థి ప్రచారం



ఉదయం ప్రతినిధి – గుమ్మలక్ష్మీపురం


గుమ్మలక్ష్మీపురం ఎంపిటిసి పదవికి పోటీచేస్తున్న వైసిపి అభ్యర్థి పెంకి భారతి సోమవారం సాయంత్రం ముమ్మ రంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గ్రామంలోని కొండవిది, మెయిన్ రోడ్డు,శృంగవరపు వీధిలో ఇంటింటికి వెళ్లి ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు రాత్రి 9 గంటల వరకు ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల జాతకాలు. విజేతలెవరో మరి కొద్దిసేపట్లో వెల్లడి

ఉదయం ప్రతినిధి – విజయనగరం

ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఎన్నికల్లో అభ్యర్థుల జాతకాలు బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉన్నాయి. మరి కొద్ది సేపట్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలు కానుంది. విజేతలెవరో మరికొద్ది గంటల్లో తేలనుంది. అసలే తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడంతో గెలుపు అవకాశాలపై ఎవరికి వారు లెక్కలేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో మేయర్, చైర్మెన్ పదవుల కోసం, కార్పొ రేటర్, కౌన్సిలర్ పదవుల కోసం అభ్యర్థులు ఎంత మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగాకూటమి, వైకాపాపార్టీలఅభ్యర్థులమధ్యనేపోటీజరిగింది.విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ పదవితో పాటు 62 డివిజన్లకు కార్పొరేటర్ పదవులకు ఎన్నికలు జరిగా యి. 62.73 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపు పై ఎవరికి వారే ధీమాగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ లోలోపల మాత్రం టెన్షన్ గానే ఉన్నారు. అలాగే బొబ్బిలి మున్సిపాలిటీ లో 71.30శాతం, నెల్లిమర్ల నగర పంచాయతీలో 80.30 శాతం పోలింగ్ నమోదయింది. మరి విజయావకాశాలు ఎవరిని వరిస్తాయో మరి కొద్ది గంటల్లో తేలనుంది.

జెన్ జీకి అనుకూలంగా విజయసాయి అడుగులు




ఉదయం ప్రతినిధి – నెల్లూరు

విజయసాయిరెడ్డి పార్టీ ఉద్దేశాలు.. విధివిధానాలను ఆయన అప్పుడప్పుడు సినిమా టీజర్ లాగా విడుదల చేస్తున్నారు. విజయ సాయి రెడ్డి ప్రజలను కాకుండా.. సామాజిక మాధ్యమాలను నమ్ముకున్నారు. తన పార్టీ గురించి.. విధివిధ¬ానాల గురించి ఇప్పటివరకు కొన్ని విషయాలు మాత్రమే చెప్పారు. ఇప్పుడు వాటిని బహిరంగంగా బయటపెట్టే క్రమంలో రీల్స్ ను ఉపయోగిస్తున్నారు. జన్ జడ్ మీద పూర్తిగా దృష్టి సారించిన ఆయన.. వారిని ఆకట్టుకునేందుకు రీల్స్ మాత్రమే మార్గమని భావించారు. అందువల్లే రియల్ టైం నుంచి రీల్స్ టైం లోకి వచ్చేసారు.ఒకప్పుడు విజయసాయిరెడ్డి వైసీపీలో కీలక నాయకుడిగా ఉండేవారు. జగన్ కు దగ్గరగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత సొంత రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని పనులు నిమగ్నమయ్యారు. అయితే ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చిన తీరు.. ప్రజల్లోకి వెళ్లాలి అనుకుంటున్నా ప్రచార పద్ధతులు ఇప్పుడు పూర్తిగా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రీల్స్ ద్వారా తన రాజకీయ ఆలోచనలను ఆయన ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.విజయసాయిరెడ్డి గతంలో రాజ్యసభ సభ్యుడిగా.. వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2025 జనవరిలో రాజ్యసభ సభ్యత్వానికి.. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. క్రియాశీలమైన రాజకీయాలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. అయితే ఆ విరామం ఎక్కువ కాలం కొనసాగలేదు. సరిగా ఈ ఏడాది ఆగస్టులో తిరిగి రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రజల గొంతుకను.. అసెంబ్లీ.. పార్లమెంట్లో వినిపించేందుకు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఆయన వెల్లడించారు.ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీలు రావడం కొత్తేమీ కాదు. కానీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయాల్లోకి తిరిగి వస్తున్న తీరు మాత్రం ఆసక్తిని కలిగిస్తోంది. ఒకప్పుడు వైసిపి కీలక వ్యూహకర్తగా వ్యవహరించిన ఆయన ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు అడుగులు వేస్తున్నారు. అయితే ఈసారి ఆయన రాజకీయ ప్రచారంలో సోషల్ మీడియాకు.. ముఖ్యంగా డిజిటల్ మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాలు మారిపోతున్నాయా.. రాజకీయ ప్రచారం రీల్స్ స్థాయికి చేరుతోందా అరే చర్చ కూడా మొదలైంది. విజయ్ సాయి రెడ్డి గతంలో జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ వ్యవహారాలలో కీలక పాత్ర పోషించారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. అయితే 2025 జనవరిలో ఊహించని విధంగా రాజ్యసభ సభ్యత్వానికి.. వైసీపీకి రాజీనామా చేశారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటారని సంకేతాలు కూడా ఇచ్చారు. కానీ 2020లో మళ్ళీ తన రాజకీయ భవిష్యత్తుపై కీలకమైన ప్రకటనలు చేస్తూ.. సంచలనానికి కారణమయ్యారు.తన రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యయాన్ని ప్రారంభించాలని విజయ సాయి రెడ్డి అనుకున్నారు. టిడిపి.. వైసిపి వంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రజల సమస్యలను అసెంబ్లీ.. పార్లమెంట్ లో వినిపించడమే తన లక్ష్యమని చెప్పారు. తన పార్టీలో యువతకు పెద్దపీట వేస్తానని కూడా వెల్లడించారు. 40 సంవత్సరాల వారికి పార్టీలో అవకాశాల్లో 66% ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి జనవరి 1న ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించడం.. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగులకు నెలకు పదివేల భృతి ఇచ్చే ప్రతిపాదనను ప్రస్తావించారు..కొత్త పార్టీ ఏర్పాటుకు విజయసాయిరెడ్డి ముహూర్తాన్ని కూడా ప్రకటించారు.
నవంబర్ 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో పార్టీ పేరు ప్రకటిస్తానని అక్టోబర్ 20న ఆయన వెల్లడించారు. దీంతో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ రాక మీద చర్చ మొదలైంది. ఇప్పటి రాజకీయాల్లో సభలు, సమావేశాలు, ప్రెస్ మీట్లు మాత్రమే సరిపోవడం లేదు.. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వెళ్లడం కూడా ముఖ్యమైనదని.. ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్..ఇన్ స్టా గ్రామ్ రీల్స్, ఫేస్ బుక్ వీడియో ద్వారా తన ప్రసంగాలను ప్రజలకు తీసుకెళ్లాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారు.

నేటితో పరిషత్ ఎన్నికల ప్రచారానికి తెర

- సాయంత్రం 5:00 గంటల తర్వాత మైకులు, ప్రచారాలు బంద్
- 48 గంటల నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జిల్లాలో నవంబర్ 5వ తేదీన జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి బహిరంగ ప్రచారానికి నవంబర్ 3వ తేదీ మంగళవారం సాయంత్రం 5:00 గంటలతో తెరపడనుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్ ప్రభాకరరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచే ప్రచార గడువు ముగుస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు జరిగే సంబంధిత ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఓటు హక్కు లేని రాజకీయ నాయకులు, స్టార్ క్యాంపెయినర్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు మంగళవారం సాయంత్రం 5:00 గంటలలోపు ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లిపోవాలని కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రాల్లోని లాడ్జీలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు, ప్రైవేటు వసతి గృహాల్లో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాయని, నిబంధనలకు విరుద్ధంగా బయటి వ్యక్తులు ఎవరైనా ఆశ్రయం పొందితే వారిపై, సదరు యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సాయంత్రం 5:00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ మైకులు, లౌడ్ స్పీకర్లు, ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సమావేశాలు నిర్వహించరాదని, ఇంటింటి ప్రచారం సైతం ఎన్నికల నిబంధనలకు లోబడి మాత్రమే చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే సందేశాలు, ప్రకటనలు పంపడంపై సైబర్ విభాగం గట్టి నిఘా ఉంచుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రచారం ముగిసిన సమయం నుంచి పోలింగ్ ముగిసే వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై పూర్తిగా నిషేధం అమల్లో ఉంటుందని, సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

విద్యా సంస్థల ఆవరణలో పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయం నిషిద్ధం

- విద్యా సంస్థల్లో పొగాకు నిషిద్ధ బోర్డులను ఏర్పాటు చేయాలి
- ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించాలి
- జిల్లా ఎన్.సి.డి పిఓ డాక్టర్ జగన్ మోహన్



ఉదయం ప్రతినిధి – గరుగుబిల్లి

విద్యాసంస్థల ఆవరణలో పొగాకు వినియోగం, ఉత్పత్తుల విక్రయం నిషిద్ధమని, నిబంధనలు సూచించే బోర్డులు/పోస్టర్స్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయాలని,పొగాకు ఉత్పత్తులు వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు ఆదేశించారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 లో భాగంగా (టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్) అమలు తీరును సోమవారం ఆయన ఉల్లిబద్ర,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా పరిశీలించారు. పొగాకు నిషిద్ధ పోస్టర్ ఉండగా, నిబంధనలు సూచించే బోర్డు ఏర్పాటు చేయించారు. వైద్య సిబ్బందిచే సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయించారు. విద్యాసంస్థల ఆవరణలో ఎవరైనా పొగాకు వినియోగం, విక్రయాలకు పాల్పడితే తగు చర్యలు ఉంటాయని, స్కూల్స్ ఆవరణలో ఉన్న షాపులకు నిబంధనలపై హెచ్చరించాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులు వినియోగించిన ఆనవాళ్లు ఏవైనా ఉన్నాయా అన్ని పర్యవేక్షకుడు ఎప్పటికపుడు గమనించాలని సూచించారు. ప్రజల్లో ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకు వచ్చేలా సమష్టిగా అవగాహన కల్పించాలన్నారు. పొగాకు క్యాన్సర్ కారకమని పొగాకు త్రాగే వారితో పాటుగా పొగ పీల్చే వారిపై కూడా ప్రభావముంటుందన్నారు. శరీరంలో ముఖ్యమైన అవయవాల పనితీరు దెబ్బతింటుందన్నారు. విద్యార్థుల ఆర్.బి.ఎస్.కె స్క్రీనింగ్ వివరాలు పరిశీలించారు. ఆరోగ్య అవగాహన కల్పించారు. అనంతరం హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ తీరుపై రికార్డులు, ఆన్లైన్ వివరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్. శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో ప్రసాద్, వైద్య సిబ్బంది అనిత , వెంకట సుబ్బలక్ష్మి, పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరో వాయిగండం.. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల్లో ఆందోళన

ఉదయం ప్రతినిధి – విశాఖపట్టణం

బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను వేగంగా ముందుకు కదులుతుండటంతో ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అర్నబ్ తుపాను ప్రభావంతో జరిగిన నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉండ టం ప్రజలను కలవరపెడుతోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు వాతావరణశాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో అధికార యం త్రాంగం అప్రమత్తమవుతోంది.బంగాళాఖాతంలో ఏర్ప డిన మురసు తుపాను గత ఆరు గంటల్లో గంటకు 23 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 560 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 640 కిలోమీటర్లు, నెల్లూరుకు 630 కిలోమీటర్లు, ఒంగోలుకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను కదలికలను వాతావరణ శాఖ నిశితంగా పరిశీలిస్తోంది. రేపు ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇది తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.మురసు తుపాను తీరం దాటే సమయంపై వాతావరణశాఖ అంచనాలు ఆసక్తికరంగా మారాయి. సోమవారం అర్ధరాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజామున నెల్లూరు నుంచి నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగా లులు, భారీ వర్షాలు నమోదయ్యే ప్రమాదం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా సముద్ర తీరానికి సమీపంలో నివసిం చే మత్స్యకార కుటుంబాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. తుపాను ప్రభావం కేవలం తీర ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలపై ఉండనుంది. మరో మూడు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాం తాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రజ లు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో వరద నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించ వద్దని చెబుతున్నారు. మురసు తుపాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. వాతావ రణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, అధికా రుల నుంచి వచ్చే హెచ్చరికలను పాటించాలని కోరారు. అవసరమైన మందులు, తాగునీరు, అత్యవసర వస్తువుల ను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ము రసు తుపాను గమనం, తీవ్రత, తీరం దాటే ప్రాంతంపై స్పష్టత వచ్చే కొద్దీ ఏపీ యంత్రాంగం అప్రమత్తతను మరింత పెంచాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. తుపాను ప్రభావం ఎంత మేర ఉంటుందనేది రాబోయే 24 గంటల్లో కీలకం కానుంది. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండటం, అధికారుల సూచనలను పాటించడం అత్యంత అవసరం.

బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు.. వైఎస్ఆర్‌సీపీకి ఫలితాలు కీలకం

ఉదయం ప్రతినిధి – విజయవాడ

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసింది. మున్సిపల్ పరిధిలోని పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ప్రధాన అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రమైంది. క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం , పోలింగ్ సరళిని విశ్లేషిస్తే.. ఎన్నికల సమరం దాదాపు ఏకపక్షంగానే సాగిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికార ఎన్డీయే కూటమి సమన్వయంతో, అత్యంత ఉత్సాహంగా ఓటర్లను పోలింగ్ బూతులకు తరలించగలిగితే, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రం మొదటి నుంచి ఆ స్థాయి వ్యూహాత్మక ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోయాయని భావిస్తున్నారు.వాస్తవానికి ఈ పురపాలక సమరంలో పోటీకి దిగడంపై వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ప్రారంభమికంగా కొంత సందేహాలు నిలిచాయి. ఓటమి చవిచూసిన తర్వాత ఏర్పడిన నిరాశ, ఆర్థిక , లీగల్ ఒత్తిళ్ల కారణంగా పోటీకి దిగేందుకు స్థానిక నేతలు వెనుకాడారు. అయితే, పార్టీ ఉనికిని చాటుకోవడానికీ, కేడర్ చేజారకుండా చూడటానికి ఎన్నికల బరిలో నిలవాల్సిందేనని అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీలో నిలిచారు. పోటీపడినప్పటికీ గెలుపును నిర్దేశించే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ , నిధుల సమీకరణ , ముమ్మర ప్రచారంలో అధికార కూటమిని ధీకొట్టే స్థాయిలో వైసీపీ సీరియస్‌గా దృష్టి సారించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది.



స్థానిక నాయకత్వంపై రకరకాల ఒత్తిళ్లు ఉండటం, అనేక ప్రాంతాల్లో నామినేషన్ల ఘట్టం నుంచి ప్రచారం దాకా అనుకున్న స్థాయిలో సహకారం లభించకపోవడం వల్ల ఈ పుర ఎన్నికల్లో వైసీపీకి ప్రతికూల ఫలితాలు వస్తాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, రాయలసీమలోని కొన్ని కంచుకోటలు, కడప, పులివెందుల, ఉమ్మడి ఉమ్మడి జిల్లాలలోని సొంత సీట్లతో పాటు పట్టణాల్లోని పేద వర్గాల ఓటు బ్యాంక్ తమను గట్టెక్కిస్తుందని వైఎస్సార్‌సీపీ ఆశాభావంతో ఉంది. కనీస స్థాయిలో స్థానాలు సాధించినా సరే, పార్టీ ఇమేజ్ నిలబడుతుందని అధిష్ఠానం ధీమాగా ఉంటే.. పరాజయం ఎదురైతే కేడర్ మానసిక స్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.ఈ పురపాలక ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్ల అధికార పీఠాలకే పరిమితం కాకుండా, ఇరు పార్టీల శ్రేణుల మానసిక దృక్పథం పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత కోలుకోవడానికి ప్రయత్నిస్తున్న వైసీపీకి ఈ ఫలితాలు ఒక పరీక్ష లాంటివి. ఒకవేళ ఊహించని విధంగా వైసీపీ ఓ మాదిరి ఫలితాలను సాధించగలిగితే.. “పార్టీకి ఇంకా క్షేత్రస్థాయిలో పట్టు ఉంది, ప్రజాదరణ తగ్గలేదు అనే సందేశం ప్రజల్లోకి వెళ్లి, నాయకుల్లో సరికొత్త ఉత్సాహం నిండుతుంది. క్లిష్ట సమయం నుంచి కోలుకోవడానికి ఆ పార్టీకి ఇవి సంజీవనిలా ఉపయోగపడతాయి.మరోవైపు, అధికారంలోకి వచ్చాక సాధిస్తున్న ఈ విజయాల ఊపును కొనసాగించాలని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరుతోంది. పట్టణ ప్రాంత ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధి, మౌలిక సదుపాయాల వైపే మొగ్గు చూపుతారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు తమకే విజయాన్ని అందిస్తాయని కూటమి నేతలు చెప్తున్నారు. నవంబర్ 3న వెలువడబోయే ఓట్ల లెక్కింపు ఫలితాలు వైఎస్సార్‌సీపీ భవిష్యత్ కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యమైన దిక్సూచిగా మారనున్నాయి. ఈ ఫలితాలు వైసీపీని మళ్లీ పుంజుకునేలా ఉత్సాహపరుస్తాయా లేక అధికార కూటమికి తిరుగులేని ఆధిక్యాన్ని ఇచ్చి ప్రతిపక్షాన్ని మరింత ఇరకాటంలో పడేస్తాయా అనేది మరో రోజులో స్పష్టం కానుంది.

1300కే ఏపీలో ధరణి రైస్

ఉదయం ప్రతినిధి – రాజమండ్రి

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో బహిరంగ మార్కెట్లో బియ్యంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా పలు రకాలకు చెందిన బియ్యం కిలో రూ. 80 నుంచి రూ.100కు చేరింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఏపీ ప్రభుత్వం వారికి శుభవార్త చెప్పింది.భారీగా పెరుగుతున్న బియ్యం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించేలా రాయితీపై పలు రకాల వస్తువులను అందిస్తోంది. ఫైన్ రకం బియ్యంతోపాటు.. ఉల్లిపాయతోపాటు ఇతర కూరగాయలను రాయితీపై అందిస్తోంది. అయితే, ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఊరటనిచ్చే విధంగా రూ. 1300లకే ధరణి బ్రాండ్ 26కిలోల సన్నబియ్యం బస్తాను అందుబాటులోకి తీసుకొచ్చింది.రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలులో తిరుపతి జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లాలోని రెండు ప్రధాన రైస్ మిల్లుల నుంచి తిరుపతి జిల్లాతోపాటు చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల మొత్తం ఎనిమిది జిల్లాలకు ధరణి బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్నారు. ప్రతీరోజూ వేలాది క్వింటాళ్ల బియ్యం రైతుబజార్లు, పంపిణీ కేంద్రాలకు రవాణా అవుతోంది. తక్కువ ధరకు అందిస్తున్న 26కిలోల ధరణి బ్రాండ్ సన్న బియ్యం బస్తాలను అర్హులైన ప్రతీఒక్కరికీ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. బస్తాను పొందే వినియోగదారుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్లను నమోదు చేస్తున్నారు.పాస్తా ఎంచుకోండిఇదిలాఉంటే.. ఈ ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతు బజార్లలో మాత్రమే కాకుండా మొబైల్ వాహనాల ద్వారా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు కూడా విక్రయాలను విస్తరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలని అన్నారు. మిగిలిన బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. మరోవైపు బియ్యం ధరలు అదుపులో ఉండేలా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో అధికారులు చర్చిస్తున్నారు. కొన్నిరకాల బియ్యం ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యం కేజీ రూ.66, సాధారణ స్టీమ్ బియ్యం కేజీ రూ.47కు మించకుండా విక్రయించేందుకు అంగీకరించారని అధికారులు చెబుతున్నారు.

పీఎం జన్మన్ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

పనుల పురోగతిపై సమీక్షించిన జాయింట్ కలెక్టర్ ఆర్ వైశాలి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జాయింట్ కలెక్టర్ ఆర్ వైశాలి సోమవారం పంచాయతీరాజ్ (పీఆర్), ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాటు సంబంధిత సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద చేపడుతున్న రహదారి నిర్మాణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటివరకు చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, ఇంకా కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల స్ట్రాంగ్ రూములను పరిశీలించిన పాలకొండ సబ్ కలెక్టర్

భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణపై అధికారులకు సూచనలు



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం తన పర్యటనలో భాగంగా గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలోని ఉద్యానవన కళాశాలను సందర్శించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అనంతరం పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా చర్యలు, నిరంతర పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డీఎస్పీ, సీఐతో పాటు కురుపాం, జీఎం వలస, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, కొమరాడ మండలాలకు సంబంధించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ సూచించారు.

వర్షాలు నేపధ్యంలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి:జిల్లా ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ హేమాక్షి

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు అవసరమని, కాలానుగున రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం ఉంటుందని జిల్లా ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ టి. హేమాక్షి తెలిపారు. ఈ మేరకు సోమవారం నీలకంఠాపురం (చిన్నయ్యవలస) గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. దగ్గు , పడిశం, వాతం, ఇతర సీజనల్ రుగ్మతలకు డాక్టర్ హేమాక్షి తనిఖీలు నిర్వహించి చికిత్స అందించారు. అవసరమైన ఆయుర్వేద మందులు సిబ్బంది అందజేసి వినియోగించే విధానాన్ని వివరించారు. వర్షాలు కారణంగా ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, సాధ్యమైనంతవరకు వేడిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని, పిల్లలు వర్షంలో తడవకుండా జాగ్రత్తపడాలని, ఆవిరి పట్టడంతో శ్వాస సునాయా సం అవుతుందని, చేతులను ఎప్పటికప్పుడు శు భ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఇటువంటి రుగ్మతల కు ఆయుర్వేదంతో మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ స్టాఫ్ పద్మ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలిసిన

ముందస్తు భద్రత చర్యలు పట్ల అధికారులకు దిశా నిర్దేశం

జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

నవంబర్ 03న పార్వతీపురం,సాలూరు పాలకొండలో జరిగే మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఐపీఎస్ గారు పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి సంబంధిత అధికారి రిటర్నింగ్ ఆఫీసర్ (=వా) మరియు ఇతర సంబంధిత అధికారులతో కలిసి తమ పరిధిలోని ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని స్వయంగా సందర్శించాలి. కౌంటింగ్ జరిగే కేంద్రాలను సంబంధిత అధికారులు కూడా తప్పనిసరిగా తనిఖీ చేయాలి. సంయుక్తంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, గుర్తించిన లోపాలను వెంటనే సరిచేయాలి.సున్నితమైన ప్రాంతాల్లో అవసరమైన చోట్ల అదుకట్టలు, కంచెలు ఏర్పాటు చేయాలి. కౌంటింగ్ కేంద్రం బయటి పరిసరాల్లో తగినంత లైటింగ్ ఉండేలా చూడాలి. అధికారిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతో పాటు అత్యవసర మార్గాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలి. డ్రోన్లను విస్తృతంగా వినియోగించి కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలు, అప్రోచ్ రోడ్లు, జనసమూహాలు ఏర్పడే ప్రాంతాలు, సమస్యాత్మక మరియు సున్నితమైన ప్రదేశాలను నిరంతరం పర్యవేక్షించాలి. ఏదైనా అవాంఛనీయ పరిస్థితి గుర్తించిన వెంటనే సంబంధిత సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు తీసుకోవాలి కౌంటింగ్ కేంద్రాల లోపల కట్టుదిట్టమైన ప్రవేశ నియంత్రణ అమలు చేయాలి. బహుళ అంచెల తనిఖీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎన్నికల అధికారులచే అనుమతించబడిన వ్యక్తులను మాత్రమే పూర్తి స్థాయి గుర్తింపు ధృవీకరణ మరియు క్రిస్మింగ్ అనంతరం లోపలికి అనుమతించాలి. కౌంటింగ్ ఏజెంట్లు ఇష్టానుసారంగా బయటకు వెళ్లి తిరిగి లోపలికి వచ్చే పరిస్థితిని అనుమతించకూడదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రవేశం, తిరిగి ప్రవేశం (=వ-వత్‌తీఎ) నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి. కౌంటింగ్ ఏజెంట్లు మరియు కౌంటింగ్ టేబుళ్ల మధ్య తగిన ఎత్తు, పటిష్టత కలిగిన మెష్ బారికేడింగ్ ఏర్పాటు చేసి, అవి సురక్షితంగా బిగించబడి ఉన్నాయో లేదో తనిఖీ చేయాలి. బ్యాలెట్ పేపర్లు మరియు ఇతర కౌంటింగ్ సామగ్రికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. అనుమతి లేని ద్రవ పదార్థాలు, అగ్గిపెట్టెలు, లైటర్లు, సిరా, మండే పదార్థాలు లేదా అల్లర్లు, విధ్వంసక చర్యలకు ఉపయోగపడే ఇతర వస్తువులను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించకూడదు. తాగునీటిని అధికారికంగా నిర్దేశించిన మార్గాల ద్వారా మాత్రమే అందించేలా చూడాలి. బందోబస్తులో ఉన్న ప్రతి పోలీసు సిబ్బందికి వారి విధులు, బాధ్యతలు మరియు అప్రమత్తతపై స్పష్టమైన బ్రీఫింగ్ ఇవ్వాలి. అవసరమైన సంఖ్యలో రిజర్వ్ బలగాలు, క్విక్ రియాక్షన్ టీమ్స్ సిద్ధంగా ఉంచాలి. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతర సమన్వయం కొనసాగించాలి. కౌంటింగ్ ప్రక్రియ అత్యంత సున్నితమైనది మరియు కీలకమైనది. ఏ చిన్న విషయాన్ని కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఎలాంటి అంచనాలకు లేదా ఊహలకు తావివ్వకుండా ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని భౌతికంగా తనిఖీ చేసి, అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉన్నాయని నిర్ధారించుకోవాలని జిల్లా ఎస్పీ గారు అధికారులను సూచించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో నవంబర్ 5న వేతనంతో కూడిన సెలవు

- దుకాణాలు, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వర్తింపు
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం మన్యం


జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే ప్రాంతాల్లో నవంబర్ 5వ తేదీ గురువారం దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం-1988లోని సెక్షన్ 31(2) ప్రకారం కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తేదీని నవంబర్ 3వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీకి మార్చిన నేపథ్యంలో, గతంలో ప్రకటించిన వేతనంతో కూడిన సెలవు తేదీని కూడా నవంబర్ 5వ తేదీకి మారుస్తూ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని దుకాణాలు, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులంద రికీ ఈ సెలవు వర్తిస్తుందని తెలిపారు. కార్మిక శాఖ జారీ చేసిన ఉత్తర్వులను జిల్లాలోని సంబంధిత అధికా రులు, యజమానులు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పని చేసే ప్రతి ఉద్యోగి, కార్మికుడు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా ఈ వెసులు బాటు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

పాస్టర్ల నూతన కమిటీ ఎన్నిక

ఉదయం ప్రతినిధి – చీపురుపల్లి

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఉన్న పాస్టర్లు అందరూ సమిష్టిగా నియోజకవర్గం నాయకులను స్థానిక జి అగ్రహారంలోని బైబిల్ మిషన్ చర్చ్ లో సోమవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గం పాస్టర్లు నూతన కమిటీ అధ్యక్షుడు గా వి జయపాల్, ఉపాధ్యక్షు డిగా బి.ఎలీషా, కార్యదర్శి డి.కృపానందం, సహాయ కార్యదర్శి ఆర్ చిన్నారావు, కోశాధికారిగా ఆర్.మత్తయి, సహాయ కోశాధికారిగా టి జక్కయ్య ఎన్నికయ్యారు. సభ్యులుగా జి యేసు రత్నం, బి గిద్యోను, వై ఉదయ్ కిరణ్, పి. సైమన్, టి. తిమోతి, ఆర్. తిమోతి ఉంటా రని అధ్యక్షుడు జయపాల్ తెలిపారు. సమావేశం లో మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి, గుర్ల మండల పాస్టర్లు పాల్గొన్నారు.


"ఇటుకలు స్థిరమైన జీవనశైలి" వారోత్సవాలు



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

భారతదేశంలో నవంబర్ 1 నుండి నవంబర్ 7, 20 26 వరకు నిర్వహించబడుతోంది. భారతదేశ బ్రిక్స్ (బ్రిక్స్) ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మరియు యుజిసి లు కలిసి దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో దీనిని నిర్వహిస్తున్నాయి. భారత ప్రభుత్వ "మిషన్ లైఫ్" లక్ష్యాలకు అనుగుణంగా, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన పెంచడం మరియు రోజువారీ అలవాట్లలో మార్పులు తీసుకురావడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ వారోత్సవాల్లో భాగంగా 7 రోజులకు 7 విభిన్న పర్యావరణ లక్ష్యాలను (థీమ్స్) కేటాయించారు: 7 రోజుల ప్రత్యేక కార్యక్రమ పట్టిక: నవంబర్ 1 ఆరోగ్యకరమైన జీవనశైలి పర్యావరణ ప్రతిజ్ఞ, యోగా, వాకథాన్, సైక్లిథాన్ మరియు మొక్కలు నాటడం. నవంబర్ 2 విద్యుత్ పొదుపు ఆఫీసులు, విద్యాసంస్థల్లో 'స్విచ్ ఆఫ్ అవర్' (ఉదయం 10–11 గంటలు), విద్యుత్ ఆదాపై అవగాహన. నవంబర్ 3 నీటి సంరక్షణ లీకేజీల తనిఖీ, వర్షపు నీటి నిల్వపై అవగాహన, క్యాంపస్ వాటర్ ఆడిట్. నవంబర్ 4 స్థిరమైన ఆహార పద్ధతులు చిరుధాన్యాలు (మిల్లెట్స్), సంప్రదాయ ఆహార ప్రదర్శనలు, ఆహార వృధా నివారణ. నవంబర్ 5 ప్లాస్టిక్ రహిత సమాజం సింగిల్-యూజ్ ప్లాస్టిక్ నిషేధ ప్రచారం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ డ్రైవ్‌లు. నవంబర్ 6 ఈ-వ్యర్థాల తగ్గింపు ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ సంస్థలకు అప్పగించడం, మొబైల్/ల్యాప్‌టాప్ రిపేర్ అవగాహన. నవంబర్ 7 సాధారణ వ్యర్థాల తగ్గింపు క్యాంపస్ మరియు పరిసరాల శుభ్రత, తడి-పొడి చెత్త వేరు చేయడం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, ఆర్టీసీ డిపోలు, మరియు విద్యుత్ శాఖ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ వారోత్సవాలలో భాగంగా ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా విజయలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో రెండవ థీమ్ విద్యుత్ పొదుపు అనే నినాదం తో కార్యక్రమం నిర్వహించి విద్యుత్ పొదుపు దేశ ప్రగతికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేటో అధికారి డా హాఫిజా బేగం మరియు జిల్లా ప్రోగ్రామ్ అధికారులు జగన్మోహన్, రవికుమార్ రెడ్డి,సూర్యకౌశిక్,విజయమోహన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి, జిల్లా డెమో అధికారులు ప్రసాద్,గిరిబాబు, జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విస్తృత ప్రచారం



ఉదయం ప్రతినిధి – పార్వతీపురం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారానికి గడువు సమీపిస్తుండటంతో సీతానగరం మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గెడ్డలుప్పి ఎంపీటీసీ అభ్యర్థి కర్రి శంకరరావు, తామరఖండి గ్రామానికి చెందిన ఆదినారాయణ, బగ్గందొరవలస, కృష్ణరాయపురం ఎంపీటీసీ అభ్యర్థి చినబోగిలి చుక్క నాగమణి (జనసేన), అంటిపేట, పనుకువలస గ్రామాలకు చెందిన లత శ్రీ, మరిపివలస, సూరంపేట ఎంపీటీసీ అభ్యర్థి మర్రపు సత్యనారాయణ తరపున ఆయా గ్రామాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని అభ్యర్థులకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి కంకణపల్లి అనురాధతో పాటు కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని, ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో విజయం చేకూర్చాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో మండలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి

ఎన్నికల నిర్వహణలో సహకరించిన ఓటర్లు, అధికారులు, పోలీసు సిబ్బంది, మీడియాకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు

ఉదయం ప్రతినిధి – పార్వతీపురం



పార్వతీపురం మన్యం జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టిందని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఓటర్లకు అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎన్నికల సిబ్బందికి అవసరమైన పోలింగ్ సామగ్రి, విధుల నిర్వహణకు సంబంధించిన సూచనలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడం వల్ల పోలింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసిందని, జిల్లాలోని సంబంధిత అధికారుల నుంచి అందిన నివేదికల మేరకు ఎన్నికల నిర్వహణ సజావుగా పూర్తయినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన ఓటర్లకు, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఇతర శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Owner,Editor, Publisher : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA, Published from H.NO: 1-19-17, BC COLONY, AGRAHARAM, VIZIANAGARAM, ANDHRA PRADESH - 535004. Printed at NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA , KURNOOL, ANDHRA PRADESH - 518380.
Editor : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA. Registration Number : APTEL/26/A5462